క్లుప్తంగా

స్టూడెంట్ కిట్ల పంపిణీ



స్టూడెంట్ కిట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కదిరి అర్బన్: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్టూడెంట్ కిట్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చెన్నకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం వెంకటాచలం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కాళసముద్రం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.

45 గోకులాల మంజూరు

బత్తలపల్లి: ఉపాధి హామీ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలానికి 45 గోకులాలను కేటాయించినట్లు ప్రాంతీయ పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారు స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో విలేకర్లతో మాట్లాడారు. మండలానికి 45 గోకులాలు మంజూరయ్యాయని, అందులో ఎస్సీ, ఎస్టీకి 23, జనరల్, ఓబీసీకి 22 కేటాయించినట్లు తెలిపారు. పశువులు, గొర్రెలు, కోళ్ల సంఖ్య ఆధారంగా రూ.80 వేలు మొదలుకొని రూ.2.30 లక్షల చెల్లిస్తారన్నారు. ఇందులో పది శాతం రైతు వాటా భరించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుల కొరకు సమీప పశువైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఓడీచెరువు: ప్రకృతి వ్యవసాయం లాభదాయకం ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా రైతులకు సూచించారు. బత్తినపల్లిలో రైతులు శ్రీనివాసులు, అక్కులప్ప ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన కూరగాయలతో పాటు మొక్కజొన్న, సజ్జ, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయంత కలిగే ప్రయోజనాలను వివరించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి ఇలియాస్ మహమ్మద్, వీఎస్ఏ భరత్, ఆత్మ ఏటీఎం మౌనిక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూముల పరిశీలన



విలేజ్ మ్యాపును పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి

ముదిగుబ్బ: సానేవారిపల్లి రెవెన్యూ పొలంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం భూములను శుక్రవారం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 2,170 ఎకరాల భూములను సేకరించాలని సోలార్ కంపెనీల ప్రతినిధులు కోరారని, ఇందులో భాగంగా సానేవారిపల్లి పొలంలో భూములను పరిశీలిస్తున్నామన్నారు. భూములు లీజుకు ఇవ్వడానికి రైతులు అంగీకరిస్తే సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. త్వరలో గ్రామంలో రైతులతో ప్రజావేదిక ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మునుస్వామి, వీఆర్‌ఓ సాయిచరణ్ రెడ్డి, సర్వేయర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష!

- జీవాల్లో చిటుకు వ్యాధి సమస్య
- వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశువైద్యులు



బత్తలపల్లి సమీపంలో మేత మేస్తున్న గొర్రెలు

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో కురిసే వర్షాలకు జీవాల్లో ముఖ్యంగా మేకలు,, గొర్రెలకు మిడరసం లేదా చిటుకు వ్యాధి వస్తుంది. ఈ నేపథ్యంలో పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని బత్తలపల్లి మండల పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి సూచించారు. చిటుకు వ్యాధి ఎలా వస్తుంది.. లక్షణాలు.. చికిత్స తదితర వాటి గురించి ఆయన తెలిపారు.

వ్యాధి కారణాలు..

గొర్రె పిల్ల లేదా మేక పిల్ల చాలా ఎక్కువగా పాలు తాగినప్పుడు, అధికంగా దాణా వేసినప్పుడు, ఇతర వ్యాధులు సోకినప్పుడు వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు, పరాన్న జీవులు ఎక్కువగా కడుపులో ఉన్నప్పుడు, ఎక్కువగా గడ్డి మేసినప్పుడు పేగుల్లో కదలికలేనప్పుడు ఈ వ్యాధి సోకుతుంది. క్లాస్ట్రీడియం అనే సూక్ష్మజీవి జీవాల పేగుల్లో తక్కువగా ఉంటుంది. ఆహారంలో పిండి పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పుడు ఇవి వృద్ధి చెంది విష పదార్థాలను విడుదల చేస్తాయి. ఖరీఫ్‌లో తొలకరి జల్లులకు పచ్చిగడ్డి ఎక్కువగా వచ్చి దానిని జీవాలు మేయడంతో ఈ వ్యాధి వస్తుంది. వాడుపడ్డ గడ్డిని ఎక్కువగా తినడంతో కూడా రావొచ్చు. అతిగా తినడంతో వస్తుంది కాబట్టి ఈ వ్యాధిని తినే వ్యాధి అంటారు. ఇది సోకిన కొద్ది సమయంలోనే తీవ్రరూపం దాల్చి గొర్రెలు మరణిస్తాయి. అందువల్ల దీనిని చిటుకు రోగం అని కూడా పిలుస్తారు. అంతే కాకుండా దీనిని గడ్డిరోగం, మూర్ఛవ్యాధి, పాటురోగం, మెదనరం, నెత్తిపిడుగు వ్యాధిగా పిలుస్తుంటారు.

వ్యాధి లక్షణాలు..

మందలో బలిష్ఠంగా ఉన్న మేకలు, గొర్రెలు ఎటువంటి వ్యాధి లక్షణాలు లేకుండానే అకస్మాత్తుగా మరణిస్తాయి. రాత్రి బాగానే ఉండి ఉదయం లేచేసరికి మృతి చెంది ఉంటాయి. చనిపోయే ముందు నీరసంగా ఉండి తూలుతూ ఉండటం, కనుగుడ్లు తిప్పడం, ఉద్రిక్తంగా ఉండటం, పళ్లు కొరుకుతూ గాలిలోకి ఎగిరిపడి చనిపోతాయి. ఈ వ్యాధి లక్షణాలు ఉదయం, మధ్యాహ్నం ఎక్కువగా కనిపిస్తాయి. కాళ్లతో పొట్టను తన్నడం, పక్కకితిరిగి పడుకోవడం, కిందికి పైకి లేవడం వంటివి చేస్తాయి. సూక్ష్మజీవులు విడుదల చేసిన విష పదార్థాలు మెదడుపై ప్రభావం చూపడంతో జీవాలు వెంటనే చనిపోతాయి.

చికిత్స..

ఈ వ్యాధి జీవాల పెంపకందారుల్లో కునుకు లేకుండా చేస్తుంది. సరైన సూచనలు పాటిస్తే వ్యాధి నుంచి జీవాలను కాపాడుకోవచ్చు. ఖరీఫ్ ప్రారంభం మందలోని పశువులను వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. దీంతో ఈ వ్యాధి బారిన పడకుండా పశువులను కాపాడుకోవచ్చు. తీవ్రమైన దశలో చికిత్సకు నయం కాదు. తీవ్రత తక్కువగా ఉన్నప్పుడు గొర్రె లేదా మేక పిల్లలకు 5 మి.లీ టాక్సిన్‌ను చర్మం కింది పొరల్లో ఇవ్వాలి. తద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు. గొర్రె బరువును బట్టి పెన్సిలిన్ లేదా యాంటిబయోటిక్ మందును ఇవ్వాలి. ఫ్లుక్సినిన్ మేగ్లుడిన్ మందును ఇవ్వాలి. వీలైతే యాంటాసిడ్ లేదా యాంటి బ్లోట్ మందులను తాగించాలి. థయమిన్(బీ1) ఉండే విటమిన్ ఇంజెక్షన్‌ను కండకు చేయాలి. విష పదార్థాల ప్రభావం తగ్గించేందుకు సెలైన్లు, కార్టికోస్టిరాయిడ్‌ను రక్తం ద్వారా ఇవ్వాలి.

నివారణా చర్యలు..

ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వర్షాలు పడినప్పుడు ఎక్కువగా పచ్చిగడ్డి మేపరాదు. ఖరీఫ్‌లో చిటుకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. మొదటి డోస్‌ను ఆరువారాలు నిండిన పిల్లలకు ఇవ్వాలి. తర్వాత మూడువారాల లోపు పిల్లలకు రెండో డోస్ ఇవ్వాలి. ప్రతి సంవత్సరం ఈ టీకాలు క్రమం తప్పక వేయించాలి. ఈనడానికి రెండు, మూడువారాల ముందు, లేదా గర్భంతో ఉన్నప్పుడు టీకాలు మేకలు, గొర్రెలకు వేస్తే 8 నెలల వరకు పుట్టే పిల్లలకు చిటుకు రోగం రాదు.

ధర్మవరం నియోజకవర్గంలో గొర్రెలు, మేకల వివరాలు ఇలా..

మండలం	గొర్రెలు	మేకలు
ధర్మవరం	85,000	15,000
బత్తలపల్లి	86,000	12,000
తాడిమర్రి	80,000	10,000
ముదిగుబ్బ	1,35,000	15,000

ముమ్మరంగా పారిశుధ్య పనులు



కంబాలపర్తిలో వాటర్ ట్యాంకు వద్ద శుభ్రం చేయిస్తున్న ఎంపీడీఓ

పుట్టపర్తి అర్బన్: మండలంలోని జగరాజుపల్లి, వెంకటగారిపల్లి, వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి, కంబాలపర్తి గ్రామాల్లో ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో ముమ్మరంగా పారిశుధ్య కార్మికులు చేపట్టారు. నిల్వ ఉన్న మురుగునీటిపై బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. నివాసప్రాంతాల్లో పిచ్చిమొక్కలు తొలగించారు. తాగునీటి ట్యాంలకు శుభ్రం చేయించారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల సెక్రెటరీలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

7న దుకాణాల వేలం

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 7వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో గదులు, ఐస్‌క్రీమ్, టోల్‌గేట్, కొబ్బరి చిప్పలు, అమ్మవారి ఫోటోల విక్రయానికి వేలం జరుగుతుందన్నారు. ప్రతి వేలంపాటకు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ముందుగా డిపాజిట్ సొమ్ము, ఆధార్‌కార్డు అందజేయాలని సూచించారు. వివరాల కోసం 9866383092 నంబర్‌కు సంప్రదించాలన్నారు. ఈ వేలం దేవదాయశాఖ అధికారుల ఉత్తర్వుల మేరకు జరుగుతుందని పేర్కొన్నారు. వేలం హక్కు కాలపరిమితి సంవత్సరం ఉంటుందని తెలిపారు.

పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ



బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

బత్తలపల్లి: పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బండారు రామాంజనేయులు, సాకే లక్ష్మన్న అన్నారు. శుక్రవారం బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో బీఆర్ అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు అక్కిం భాస్కర్, మాతంగి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: దండోరా, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ షితోనే నేడు ఎస్సీల ఏబీసీడీల వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులు బండారు పెద్దఓబిలేసు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో శుక్రవారం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలతో కలసి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని అభినందనలు తెలుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బండారు నాగభూషణం, బండారు నాగరాజు, బండారు రామాంజినేయులు, బీసాని లక్ష్మన్న, శీనప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: ఎస్సీ వర్గీకరణకు సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై శ్రీసత్యసాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ కదిరప్ప హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగేంద్ర, మల్లి, జన, తిప్పయ్య, మనోజ్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: ఎస్సీ వర్గీకరణకు సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై బుక్కపట్నంలో శుక్రవారం ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రామాంజనేయులు(రాయుడు)మాజీ సర్పంచ్ యశోద నేతృత్వంలో గ్రామంలోని ప్రధాన రహదారిపై డ్రమ్ములు, నృత్యాలతో సందడి చేశారు. నాగరాజు, కుళ్లాయప్ప, నగేష్ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తనకల్లు: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్, దళిత సంఘం నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి వద్ద ఘనంగా నివాళులర్పించారు. బాణా సంచా పేల్చి, కేక్ కట్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చంద్రప్ప, చిన్నప్ప, రమణ, హనుమంతు, రవి, విజయ్‌కుమార్, కుళ్లాయప్ప, శంకర్, హరి, రామచంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: సుదీర్ఘ పోరాటంలో ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం ఆనందంగా ఉందని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సత్యమ్మ ఆలయం వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు తిప్పన్న, ఫొటో సాయి, ఎస్టీడీ నరసింహులు, నరసింహమూర్తి, బండ్లపల్లి ఆంజనేయులు, వెంకటేషు, సాయిప్రసాద్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఘన స్వాగతం



జంప్ రోప్ క్రీడాకారుడు తాహీర్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నల్లమాడ: అంతర్జాతీయ జంప్ రోప్ పోటీల్లో పాల్గొని స్వగ్రామానికి చేరుకున్న విద్యార్థికి పాఠశాల యాజమాన్యం ఘనస్వాగతం పలికింది. నల్లమాడకు చెందిన మెహతాజ్, బాబ్‌జాన్ దంపతుల కుమారుడు ఎస్. తాహీర్ స్థానిక పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. జూలై 22 నుంచి 28 వరకు జపాన్ దేశంలోని కవాస్కిలో జరిగిన అంతర్జాతీయ జంప్ రోప్ పోటీల్లో ఇండియా తరఫున పాల్గొని 11వ స్థానంలో నిలిచాడు. శుక్రవారం నల్లమాడకు చేరుకున్న విద్యార్థి తాహీర్‌కు వైఎస్సార్ కూడలి వద్ద పాఠశాల డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి, కరెస్పాండెంట్ స్వర్ణలత, జిల్లా జంప్ రోప్ అసోసియేషన్ కార్యదర్శి నరసింహనాయక్, కోచ్ పఠాన్ హనీఫ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలతో కూడలి నుంచి మెయిన్ బజార్ మీదుగా పురవీధుల్లో ఊరేగించారు.

బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష



బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సునిల్, సిబ్బంది



కొక్కంటిలో మాట్లాడుతున్న సీడీపీఓ గంగరత్నమ్మ

పుట్టపర్తి: బిడ్డకు తల్లి పాలే శ్రీరామరక్ష అని బుక్కపట్నం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు సునిల్ అన్నారు. ఆయన శుక్రవారం వైద్య, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తల్లి పాల విశిష్టతను వివరించారు. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామమోహన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కౌసల్యాసాయి, సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: ముర్రుపాలు శిశువుకు మొదటి టీకా అని సీడీపీఓ గంగరత్నమ్మ అన్నారు. కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు ఆరు నెలల పాటు కచ్చితంగా తల్లిపాలనే తాగించాలన్నారు. టీ. సదుం, మల్లిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ తల్లిపాల వారోత్సవాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఈఓ ఓటులేసు, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, సావిత్రమ్మ, ముసల్‌రెడ్డి,కవిత, హెల్త్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్: తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటి పరిధిలోని సైదాపురం 1,2, జౌకపాళ్యం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ మమత ఆధ్వర్యంలో తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

కదిరి అర్బన్: కాళసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ రాధిక, సుపర్‌వైజర్ నిహారిక తల్లిపాల ప్రాముఖ్యతను మహిళలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లీశ్వరి, సర్వేశ్వరి, హరిత తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: తల్లిపాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవిలు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం బాలింతలు, గర్భవతులకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు నజీర్, శైలజ, వెంకటేషులు, హరి శ్రీనివాస్, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

5న ధర్నా జయప్రదం చేయండి

కదిరి టౌన్: ఈనెల 5 తేదీన శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ కోరారు. శుక్రవారం కదిరి సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్నం భోజన ఏజెన్సీ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్, కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్, మున్సిపల్ కార్మికులు, అనిమేటర్స్‌పై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వీటిని అరికట్టాలని కోరుతూ ధర్నా చేపడుతున్నామన్నారు. కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నిషా, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, సాంబశివ, రామ్మోహన్, ముస్తాక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెయ్య దూడల పెంపకంతో లాభాలు

పుట్టపర్తి: పెయ్య దూడల పెంపకంతో అధిక లాభాలు గడించవచ్చని, రైతులు ఆ దిశగా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని డీఎల్‌డీఏ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహణ ,అధికారి డాక్టర్ సుధాకర్ తెలిపారు. ఆయన బుక్కపట్నం పశువైద్యుడు ఉదయ్‌తో కలిసి శుక్రవారం గూనిపల్లిలో పాడి రైతులకు పెయ్య దూడల పెంపకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం పెయ్య దూడల పుట్టుకపై 90 శాతం కచ్చితత్వంతో లింగ నిర్ధారిత వీర్యాన్ని సబ్సిడీతో అందిస్తోందన్నారు.

కంటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ధర్మవరం అర్బన్: విద్యార్థులు కళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ కంటి వైద్యాధికారి ఉరుకుందప్ప తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం 280 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఐదుగురికి దృష్టి లోపం ఉండటంతో వారికి త్వరలోనే కంటి అద్దాలను పంపిణీ చేస్తామని తెలిపారు. పాఠశాల హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓకు తీవ్రగాయాలు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై గుమ్మల్లకుంట బస్టాప్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. రాఘవంపల్లికి చెందిన చెడిపోతుల నాగరాజు ముదిగుబ్బ మండలం పెద్ద చిగుళ్లరేవు, ఉప్పలపాడు వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నాడు. ముదిగుబ్బ స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. గుమ్మల్లకుంట సమీపంలో జాతీయ రహదారి పనులు జరుగుతున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన ప్రమాద సూచికలను ఢీ కొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతపురం తీసుకెళ్లారు.పరిస్థితి విషమంగా ఉన్నట్లు రెవెన్యూ ఉద్యోగులు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

ధర్మవరం రూరల్: దర్శనమల గ్రామానికి చెందిన అక్కులప్ప అనే యువకుడు శుక్రవారం ఊజీ మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. పనికి పోలేదంటు కుటుంబ సభ్యులు దండించడంతో మనస్థాపానికి గురై ధర్మవరం మార్కెట్‌యార్డ్ సమీపంలో ఊజీ మాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

భార్య కాపురానికి రాలేదని..

చిగిచెర్ల గ్రామానికి చెందిన షబ్బీర్ శుక్రవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నించాడు. షబ్బీర్ భార్య దిల్షాద్ 15 రోజుల క్రితం అతడితో గొడవ పడి పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానాకి గురైన షబ్బీర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు(గడ్డికి కొట్టే మందు) సేవించి ఆపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు.

రుచికరమైన భోజనం అందించాలి

చెన్నేకొత్తపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసూన్ కుమార్ నాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్దుర్తి గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య, ఎంతమంది హాజరయ్యారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ప్రభుత్వం సరఫరా చేసిన విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందించారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం రుచిగా ఉందా? రోజు ఎలా ఉంటుంది? కోడిగుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పింగళి వెంకయ్య దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత, అధ్యాపకులు శంకర్, చెన్నారెడ్డి, నరసింహాచారి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ధర్మవరం అర్బన్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మికాంత్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రభుత్వం సరఫరా చేసిన నోటు పుస్తకాలు, బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలను అధిరోహించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

వ్యక్తిపై దాడి

తనకల్లు: పోకనాటుపల్లిలో శుక్రవారం శివారెడ్డి అనే వ్యక్తిపై చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి దాడి చేశాడు. వివరాలు... గ్రామానికి చెందిన శివారెడ్డికి చంద్రశేఖర్‌రెడ్డి బంధువులతో భూ తగాదాలు న్నాయి. ఈ విషయమై మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో శివారెడ్డిపై చంద్రశేఖర్‌రెడ్డి దాడి చేశాడు. బాధితుడిని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.